# పెయిల్....

పి సత్యవతి



ఆవిడ అంతులేని ఆర్భాటం. హడావుడి ఎందుకో ఏమిటో అర్థం కాలేదు వసంతకి. చుట్టాలొస్తారు. వెడతారు. వున్నంతలో లోటు లేకుండా మర్యాద చేస్తాం. అంతేగానీ "ఈ అన్‌డ్యూ ప్రాముఖ్యం ఏమిటో మరి!" అని కొంచెం విసుక్కుంది ఆ అమ్మాయి.

"మరీ అలా మగపిల్లాడిలా వుండకపోతే కొంచెం జూకాలవీ పెట్టుకొని చీరెలు కట్టుకుంటే బావుంటుందిగా. మొహాన మొటిమలు లేచినా పట్టించుకోవు. మరీ ముక్కు మీద లేచి అసహ్యంగా వుంది." అని కూతురు మీద విసుక్కుంది ఆవిడ. ఆవిడ పేరు అరవింద. ఇరవై ఏళ్ళు నిండి రెండు నెలల్లో ఓటు హక్కుకోసం ఎదురుచూస్తున్న వసంత తల్లి.

ఆవిడ విశాల నేత్రాలు చూసీ ఆవిడ గళమాధుర్యం విని ఆనందించీ. ఆవిడ శాంతం, సహృదయం మెచ్చి ఆవిడే కావాలని కట్టుకున్న ఆనందరావు భార్య.

వసంత కళ్ళు పెద్దవి చేసి తల్లికేసి ఆశ్చర్యంగా చూసింది. వసంతవి తల్లి కళ్ళే. వసంత చెల్లెలు జయంతి అటుకేసి వస్తూ "ముక్కు మీద మొటిమనీ మొహానికే అందం. నీ మగపిల్లాడి చందం ముందరికాళ్ళ బంధం" అని పాట అందుకుంది.

"నా మొటిమకీ ఈ రాబోయే చాలా గొప్ప చుట్టాలకీ ఏదో సంబంధం వున్నట్లుతోస్తూంది. అవునా!"

అని తల్లి మొహంలోకి గుచ్చి చూసి నవ్వింది వసంత.

"అవును." అంది ఖచ్చితంగా అరవింద.

"నా మొటిమ నా ఇష్టం," అని తల్లిని కవ్వించింది.

"చెప్పినట్లు వినడం మన కలవాటుందేగా ఆనందరావే పిల్లనిలా తయారు చేసేడు" అనుకుని,

"వంట ఇంట్లోకి రండి కొంచెం సాయం చెయ్యాలి."

అని పిలుచుకు వెళ్ళింది కూతుళ్ళిద్దర్నీ.

ఆ విషయంలో కూతుళ్ళు ఆవిడకి అభ్యంతరం చెప్పరు.

వేసవి సెలవులకి ఢిల్లీనుంచి వచ్చింది వసంత. వూళ్ళోనే చదువుతుంది జయంతి.

అసలింతకీ వస్తున్న చుట్టాలు ఎవరు?

అరవిందకి చాలామంచి స్నేహితురాలైన రాజ్యంగారి అక్కా, ఆమె అమెరికాలో వుండే కొడుకూను. రాజ్యం అక్క వరలక్ష్మీదేవికి అరవిందకి పెద్ద స్నేహం లేదేమరి! ఆవిడ హోటల్లో దిగకుండా ఇక్కడ దిగడం ఏమిటి! రెండు రోజులుండడం ఏమిటి!

అక్కడే వుంది అసలు రహస్యం. రాజ్యం ఆవిడని ఒప్పించి బతిమిలాడి అరవింద ఇంట్లో వుండేలా ఏర్పాటుచేసి, అరవిందకి వంద సలహాలతో పెద్ద ఉత్తరం వ్రాసింది.

ఆ ఉత్తరం చదివిన అరవింద ఇలా మారిపోయిందన్న మాట!

లక్ష్మీదేవి గారబ్బాయి ప్రకాశరావు సకల సద్గుణ

సంపన్నుడట అజాను బాహుడట అమ్మాయిల కలల రాకుమారుడట అతని మేధా సంపత్తి అపారమట. అనితర సాధ్యమట "కనుక ఈ రెండు రోజుల్లో నీ తెలివితేటలు ప్రదర్శించి అతన్ని బయటికి వెళ్ళ నీయకుండా చూసుకో. నా ముఖ్య స్నేహితురాలివి కాబట్టి. ఆడపిల్లల తల్లివి కాబట్టి, అదర్శాలంటూ మీ అయన జీతం రాళ్ళ లోనే మడి కట్టుకొని కూర్చున్నాడు కాబట్టి నేను నీ కోసం యిలా చేస్తున్నాను." అని రాజ్యం వ్రాసింది.

అమ్మాయిలిద్దరూ కూరలు తరుగుతూ, పచ్చళ్ళు నూరుతూ, పప్పులో పోపులు పెడుతూ తల్లిదగ్గర అసలు విషయాన్ని రాబట్టేరు. రాబట్టినాక ఆశ్చర్యంతో ముక్కు మీద వేలు వేసుకుని, మొటిమ చేతికి తగలగా ఫక్కుమని నవ్వింది వసంత.

జయంతి తల్లిని పరిశీలనగా చూస్తూవుండి పోయింది.

"చుట్టాల ధర్మమా అని ఇల్లూ వాకిలీ అద్దంలావున్నాయి. వంటింట్లో నుంచి వాసనలు వీధి చివరిదాకా వస్తున్నాయి. ఇలాంటి చుట్టాలు వారానికోసారి వస్తే బావుణ్ణు. డబ్బులు ఖర్చయితే పోయింది." అన్నాడు ఆనందరావు.

"ఇవ్వాళ్ళికి నా మాటవిని చీరెకట్టుకుందూ !" అంది అరవింద వసంతని బ్రతిమి లాడినట్లు.

"అలాగే అమ్మా ఇంత చెప్పాలా ?" అని రాజీకి దిగింది వసంత. పిల్లలు మంచివాళ్ళే మరీమొండి వాళ్ళు కారు అనుకుని సంతోష పడింది అరవింద.

మధ్యాహ్నం పన్నెండున్నరకి ఖచ్చితంగా వరలక్ష్మీదేవి అవిడ కొడుకుతోనూ, రెండు సూట్ కేసుల్తోనూ టాక్సీదిగింది. సినిమాల్లో చూపించే జమీందారిణిలా.

రెండు చేతులనిండా రెండు డజన్ల బంగారం గాజులు వేసుకొని జానెడు వెడల్పు జరీ అంచులున్న కంచిపట్టు చీరెకట్టి. చెవులకి రవ్వలదుద్దులు పెట్టుకొని షెళ్ళమంటూ టాక్సీది గింది. అవిడుండేది సరిగ్గా ముప్పైరెండు మైళ్ళ అవతల పల్లెటూర్లో. ఇంత కాస్త ప్రయాణానికి అంత అలంకారం ఏమిటో అర్థంకాని జయంతి అక్క కేసి చూసింది.

"అదంతేలే" అన్నట్లు నవ్వింది వసంత.

అరవింద కంగారు సరేసరి !

కాళ్ళు కడుక్కోండి, మొహం కడుక్కోండి, కూల్ డ్రింకు సేవించండి, కాసేపు విశ్రమించండి. అదుగో తువ్వాలు. ఇదిగో గ్లాసు అదుగో మీ గది. దానికి అతుక్కొని స్నానాలగది పైన పంకా.

ఆ పైన భోజనానికి రండి.

అబ్బాయి అరవిందని చేసుకున్నాడని అలిగి రెండేళ్ళు ఇంటికిరాని అరవింద మామగారు ముసలి తనంలో అవిడ . చేత సేవలు చేయించుకుని యిచ్చిపోయిన వెండికంచాలు. కొత్తగా మెరుగులు వేయించినవి బయటికి వచ్చాయి. పెళ్ళిలో స్నేహితులు చదివించిన వెండిగ్లాసులు. వెండి ఊదొత్తుల స్టాండులు కూడా వచ్చాయి.

ఎప్పుడూ వాడని పింగాణీ డిన్నర్ సెట్టుకూడా వచ్చింది.

"హోటల్లో వుండే వావుండదక్కో. అరవింద మనమనిషే. నీకు యింకో చెల్లెల్లాంటి దనుకో. అని రాజ్యం తెగబలవంత పెట్టింది. నా మూలంగా నీకు చాలా శ్రమ" అని నొచ్చుకుంది వరలక్ష్మిదేవి.

"ఫరవాలేదు ఇందులో నాకేం శ్రమలేదు" అని ఆవిడలా అన్నందుకు తను కూడా నొచ్చుకుంది అరవింద.

"నలభైయ్యో పడిలో పడ్డా మీ అమ్మాయిల ప్రక్కన కూర్చుంటే వాళ్ళల్లో కలిసిపోయావు. రాజ్యం అప్పుడే ముసలిదాన్లా అయిపోయింది. దానికంటే నేనేనయం, జుత్తుసగం నెరిసిపోయింది. అవునూ పిల్లలకి నీ పోలికే వచ్చింది. అయితే అతని రంగొచ్చింది. నీ కన్న అతనే కాస్తరంగను కుంటా."

అరవింద ఉబ్బి తబ్బిబ్బై పోయివుండాలి అనుకున్నాడు ఆనందరావు.

"భోజనం చేస్తూ అసలు విషయంచెప్పింది. ఆవిడ బుజ్జిగాడు రెండు నెలలు సెలవు తీసుకొని ఇండియా వచ్చేడు. ఈ రెండు నెలల్లో వాడికి పెళ్ళి చేసిపంపాలి. ఈ వూళ్ళో మూడు సంబంధా లున్నాయి. అవ్వన్నీ కూడా ఈ రెండురోజుల్లో చూడాలి, వాడికేం వెయ్యి సంబంధాలొచ్చాయి. అందర్నీ ఎక్కడ చూస్తాం. అందుకని వాళ్ళందరికీ ప్రాధమికార్హతలు కూడా లేవని చూడ్డానికి కూడా వెళ్ళలేదు. ఈ ముగ్గురు అమ్మాయిలకీ కావలసిన అర్హత లున్నాయి.

కనుక వాళ్ళ ముగ్గుర్లో ఎవరు చూడ్డానికి బాగుంటే, వాళ్ళని సెలక్టు చేసి పెళ్ళిచేసి పంపాలి. అందులో ఒకమ్మాయిది రాజమండ్రి. వరలక్ష్మిదేవి రాజమండ్రిరానందే వాళ్ళే ఆ అమ్మా యిని మేనమామగారింటికి తీసుకొస్తున్నారు. ఇంకో కమ్మాయిది వొంగోలు. వాళ్ళుకూడా అంతే. ఆ అమ్మాయి అన్నగారికిక్కడ ఉద్యోగం. అన్నగారింటికి వస్తోంది.

మూడో అమ్మాయిది ఈ వూరే అదీ సంగతి."

కట్నంకావాలా మరి మీకు ?

"ఊహూ అక్కర్లేదు మా, కెందుకు కట్నం నీకు తెలుసుగా మా వూళ్ళో కావల్సినంత భూమి నా వంటి మీద బంగారం మావూళ్లో ఇల్లు మా బుజ్జిగాడికి బంగారం లాంటి ఉద్యోగం మా కెందుకోయ్ వాళ్ళిచ్చే కట్నం."

మరేం కావాలి ?

అమ్మాయి డాక్టర్ కానీ ఇంజనీర్ కానీ కావాలి. పెళ్ళి ఘనంగా జరగాలి అమ్మాయిని అమెరికా పంపడానికయ్యే ఖర్చు వాళ్ళు పెట్టుకుంటే చాలు అమ్మాయికి నగానట్రా పెట్టుకోదలుచుకుంటే పెట్టుకోండి.

మీ "యిష్టం ఈరోజుల్లో నగలెవరిక్కావాలి నా దగ్గిరే తోలెడున్నాయి."

ఓహో! అయితే డాక్టర్లు ఇంజనీర్లు తప్పవనికి రారన్నమాట!

బుజ్జి ఏం మాట్లాడడేం !

బుజ్జి చూడ్డానికి బాగానే వున్నాడు సుమా! థాంక్స్‌లు

విపరీతంగా చెప్పేస్తున్నాడు. అక్కర్లేకపోయినా, కావల్సి వచ్చినా. భోజనం అయినాక బుజ్జి ఆనందరావుతో కబుర్లు చెబుతూంటే వరలక్ష్మిగారు విశ్రమించేరు.

"చూడు అరవిందా! మూడు గంటలకి రమణమూర్తి గారనీ ఒకాయనొస్తాడు. నన్ను ఖచ్చితంగా రెండున్నరకి లేపు నాలుగ్గంటలకి పెళ్ళి చూపులకి వెళ్ళాలి." అని చెప్పి, పట్టుచీరెలో నుంచీ జరీగళ్ళ వెంకటగిరి చీరెలోకి మారిపోయి "ఏమిటో ప్రాణం ఎయిర్ కండిషన్‌కి అలవాటై పోయింది." అని ముద్దుగా విసుక్కుని మంచం మీదకి వొరిగింది ఆవిడ. ఆపైన అరవింద చాలా హడావుడిగా వెళ్ళి తమ పడకగదిలోని ఎయిర్ కూలర్‌ని జయంతితో సాయంపట్టించుకుని పట్టి ఆవిడ దగ్గర పెట్టించింది. అందుకావిడ పాపం చాలా సంతోషించింది.

రెండున్నర కల్లా టీ తయారుచేసి వరలక్ష్మిదేవిని నిద్ర లేపింది అరవింద. మూడింటికి రమణమూర్తిగారూవచ్చేరు. వరలక్ష్మిదేవి ముప్పావుగంటలో తయారైంది. ప్రకాశరావుని ఫలానా ఫలానా బట్టలు వేసుకోమని ఆవిడ సూచించడం. అతను గునుస్తూనే అవి వేసుకోడం వసంత, జయంతీ చూసేరు.

"బుజ్జి ఈజే గుడ్‌బాయ్" అని వసంత ముక్కు పుచ్చుకొని లాగింది జయంతి

"సీ మోటుసరసం నువ్వూను. అసలే ముక్కుమీద."

అని మొటిమ తడుముకుంది వసంత.

వాళ్ళు పెళ్ళి చూపులకి వెళ్ళేరు.


రాత్రివంటకి తయారైంది అరవింద.

"చేసుకున్న వారికి చేసుకున్నంత" అని నవ్వుకుని వెళ్ళి పోయాడు ఆనందరావు.

ఆరు గంటలకి తల్లీకొడుకూ తిరిగి వచ్చేరు. ఆవిడ మొహం లో అసంతృప్తి కొట్టవచ్చినట్లు కనపడడంతో అరవిందకి అంత వరకూ వచ్చిన నీరసం మాయమై పోయింది.

"అమ్మాయి ఎలావుంది!" అని చాలా కుతూహలంగా అడిగింది.

"అమ్మాయి బాగానే వుందిగానీ ఇంట్లో అందరికీ కళ్ళ



వోశ్నే. పిల్లకి మరీ ఇంత మంచం కళ్ళద్దాలు. ఇలా కంటిచూపు మందగించడం హెరిడిటరీ అంటారు కదా. మరి పిల్లకి కూడా చిన్నతనంలోనే కళ్ళజోళ్ళురావా అనేది ఒకప్రశ్న. రెండోసందేహం ఏమిటంటే.

ఆ పిల్లకి డిగ్రీ అయితే వుందిగానీ అదిడొనేషన్ కట్టిచదివిన డిగ్రీ, ఎంట్రెన్స్ రాసి తెచ్చుకున్న డిగ్రీకాదు. అంటే ఆ పిల్ల మనం అనుకున్నంత తెలివి గలది కాదన్నమాట. టెన్త్‌క్లాస్ మార్కులు అంతంత మాత్రంగా వున్నాయి. ఇక ఇంటర్‌లో బొటాబొటీగా ఫస్ట్‌క్లాసొచ్చింది.

లెక్కల్లో సరిగ్గా అవసై మార్కులు కనుక ఈ సంబంధం తనకేం అంతగా నచ్చలేదంది ఆవిడ.

"మరి అబ్బాయి ఏమన్నాడూ?" అంది అరవింద ఇంకొంచెం కుతూహలంగా.

"వాడి మొహం వాడికిలాంటివేం పట్టవు అకవింద. వాడి చదువేమో ఉద్యోగమేమో వాడేమో అన్నీ నేనే ఆలోచించాలి." అని కొడుకుని అభినందించింది ఆవిడ.

"స్నానం కానిచ్చిరండి తరువాత మాట్లాడుకుందాం. అలసిపోయారు." అని అవిడ్ని స్నానానికి పంపించింది.

"బుజ్జీ స్నానం చేసెయ్. వేన్నీళ్ళుపోసుకో, షవర్ క్రింద నిలబడకు. జలుబుచేస్తుంది. అసలే వాతావరణం మార్పు" అని కొడుకుని పంపింది ఆవిడ.

బుజ్జి స్నానంచేసి తెల్లని పైజమా. ఎంబ్రాయిడరీ చేసిన లక్నోలాల్చీ వేసుకొచ్చాడు.

ఆ సరికి వసంత ఆ మధ్య కొనుక్కున్న తెల్లని సిల్కు చీరొకటి కట్టుకొని ముత్యాల జూకాలు పెట్టుకొని వచ్చింది.

జడ వేసింది. జయంతి జరీ అంచున్న పట్టులంగాకట్టి, దాని మీద అదే రంగు ఓణీ వేసుకొని వచ్చింది.

వాళ్ళిద్దరూ ప్రకాశరావుని అమెరికానిగురించినప్రశ్నలడిగారు,

"ఏంతోచడంలేదుగా మా వూరు చూద్దురుగాని రండిబుజ్జీ" అని పిలిచింది జయంతి.

"వాడి పేరు ప్రకాశ్, నేనొక్కదాన్నే బుజ్జీ అంటాను." అని కొంచెం కోప్పడింది వరలక్ష్మిదేవి.

"సారీ ఆంటీ" అని నొచ్చుకుంది జయంతి.

"ఇప్పటికే తెగ అలసిపోయావు కాసేపు పడుకుందూ అంకుల్ రాగానే భోజనం చేసి నిద్రపోదువుగాని-మళ్ళీ ఏం తిరుగు తావు." అంది వరలక్ష్మి.

"ఫరవాలేదు ఆంటీ మేం జాగ్రత్తగా తీసుకొస్తాం. కూల్ డ్రింక్స్ ఇప్పించం. ఏమీ తినిపించం, అలా కాసేపు షికారు అంతే, రండి ప్రకాశ్" అని గారంగా అతని చెయ్యిపట్టిలాగింది జయంతి.

"ఇప్పుడే వస్తాంలే అమ్మా చాలారోజులైంది ఇక్కడికొచ్చి" అని గబగబ బయటపడ్డాడు ప్రకాశ్.

వాళ్ళతన్ని నడిపించేరు, రిక్షా ఎక్కించేరు, ఆఖరికి సిటీబస్

కూడా ఎక్కించేరు .కూల్ డ్రింక్ త్రాగించేరు, వేరు సెనగకాయలు తినిపించేరు. తొమ్మిదిన్నరదాకా ఇంటికి తీసుకురాలేదు. అప్పటికే ఆనందరావూ, అరవిందా వాళ్ళకోసం ఎదురుచూస్తున్నారు.

"సారీ ఆంటీ ప్రకాశ్‌కి ఊరుచూడ్డం చాలా సరదాగావుంది. అందుకని కొంచెం లేటయింది. అక్కడికీ మేం చెబుతూనే వున్నాం మీరు కోప్పడతారు అని అయినా వినలేదు." అంది గబగబా వసంత.

వరలక్ష్మీదేవి మౌనంగా వుండిపోయిందిగానీ ఆవిడకి కోపం వచ్చిందని గ్రహించారు వాళ్ళు.

వసంత నవ్వుకుని మళ్ళీబట్టలు మార్చుకొని వచ్చింది. ఈసారి మరో చీరకట్టింది. చెవుల జూకాలు తీసి, రింగులు పెట్టుకుంది. భోజనాల దగ్గర కావాలని ప్రకాశ్ పక్కన కూర్చుంది.

"మరో పూరీ వేసుకోండి ప్రకాశ్. ఇంకొంచెం పెరుగువేసుకోండి. అమెరికాలో పెరుగుని యోగర్ట్ అంటారు కదా" అని ఇంకొంచెం సాంబారు వేసుకోండి. అమ్మ సాంబారు చేయడంలో స్పెషలిస్ట్. నేనుకూడా చేస్తాను. ఇవ్వాళ ఈ సాంబారు నేను చేసిందే ఎలావుందో చెప్పాలి." అని


"అమెరికాలో అరటిపళ్ళు దొరుకుతాయా! మీరు నాలా రోజూ అరటిపళ్ళు తింటారా! మా హాస్టల్‌లో నార్త్ ఇండియన్ భోజనం నాకు బావుండదు. నేనెప్పుడూ పళ్ళే తింటూంటాను. పళ్ళూ బిస్కెట్లూ వుంటేచాలు" అని కల్పించుకుని మాట్లాడడం మొదలు పెట్టింది.

వసంత మాటలు అరవిందకి సంతోషం కలిగించగా, వరలక్ష్మికి ఒళ్ళు మండిస్తున్నాయి.

"అన్నట్టు మీ పిల్లలిద్దరూ ఏం చదువుతున్నారు అడగనేలేదు"

నిఅ వసంత వాక్రపాహానికి అడ్డం వచ్చింది వరలక్ష్మి. "పెద్దఅమ్మాయి జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఎం.ఏ చదువుతోంది. చిన్నదిఇక్కడే బి.ఏ లిటరేచర్ చేస్తుంది. డాన్స్‌లో డిప్లొమా తీసుకుంది. వోకల్ కర్నాటక నేర్చుకుంటోంది "అంది అరవింద కొంచెం గర్వంగా.

"ఇంతోటి చదువులకా!" అన్నట్లు పెదవి విరిచి,



"ఈ ఏం.ఎలూ బి ఏల కే లే కాలక్షేపం చదువులు. మా బుజ్జి గాడికి నూరు సంబంధాలొచ్చేయి బి.ఏ లవీ ఎం లవీనూ. నేను చూడ్డానికి కూడా వెళ్ళ లేదు. తల్లి తండ్రుల తెలివి తేటలు పిల్లల కొస్తాయి గదా అందుకని తల్లి కూడా తండ్రితో సమానంగా చదువుకుని వుంటే, చిన్నప్పటినించీ మంచి మార్కులు తెచ్చుకుంటూ వుంటే, ఆతెలివి పిల్లలకి వస్తుంది పైగా ఎం ఏలూ వీ. ఏలూ అమెరికా వెళ్ళి ఏంచేస్తారు! డాక్టర్లూ ఇంజనీర్లూ అయితే ఉద్యోగం చేస్తారు డబ్బు సంపాదించుకుంటారు. ఈ రోజుల్లో వంట లెవరి క్కావాలండీ! వంటలూ కుట్లూవచ్చా అని అడిగే రోజులు పోయాయి. డబ్బులు పారేస్తే ఆమెరికాలో అన్నీ దొరుకుతాయి. ఇంట్లో చాకిరీలుచేసి హతం అయిపోడానికి ఇది నా కాలమా! అందుకని పెళ్ళి కూతురికి ఐ.క్యూ ముఖ్యం ఏమంటారు?" అని తలఎత్తి అరవింద మొహంలోకి చూసింది వరలక్ష్మి.

తల్లీ కూతుళ్ళు తలలెత్తుకుని విరగబడి ప్రకాశ్ చుట్టూ తిరిగి భజనలు చెయ్యకుండా బాగాకాల్చి వాత పెట్టాను అని సంతోషపడిపోయి అరవింద ఓ చిరునవ్వు నవ్వింది. ప్రకాశ్ వసంతతో కబుర్లు చెప్పి పడీ పడీ నవ్వుతున్నాడు. వసంత ఓ కంట వరలక్ష్మి దేవినీ మరో కంట తల్లినీ గమనిస్తూనే ప్రకాశ్‌ని మాటల్లో దింపింది. అరవింద ఏం సమాధానం చెప్పకుండా వుండటం. ప్రకాశ్‌తో వసంత ఇంకా మట్లాడుతు వుండడంచూసి, కొట్టిన దెబ్బ చాల్లేదనుకుంది వరలక్ష్మి. అందుకని,

"పిల్లల్ని ఇలా చదివిస్తున్నా వేమిటి! సైన్సు గ్రూప్‌లో సీట్లు రాలేదా? టెన్త్‌లో మంచి మార్కులు రాలేదుగావును ఆర్ట్స్ యిచ్చేరు" అంది,

"టెన్త్‌లో వసంత జిల్లా ఫస్ట్ వచ్చింది. సైన్స్ చదవనని ఆర్ట్స్ తీసుకుంది. మేం పిల్లల్ని ఏ విషయంలోనూ బలవంతం చెయ్యమండీ అంతా వాళ్ళిష్టమే" అన్నాడు ఆనందరావు కొంచెం అసహనంగా,

"వాళ్ళ మొహం వాళ్ళకిష్టాలేమిటి. అన్నీ పిల్ల చేష్టలు. ఎం ఏ చదివితే చేసేది పంతులమ్మ ఉద్యోగమేగా. ఈ డాన్సులూ మ్యూజిక్‌లు మాత్రం కాలక్షేపానికే. తరువాత ఎందుకు పనికొస్తాయి" అని పెదవి విరిచింది వరలక్ష్మి "సిగర్వం మండిపోనూ" అనుకుని తనకోపం తనలోనే అణచుకుని వూరుకుంది అరవింద.

"ఇవ్వాటికి ఈ కొరడా దెబ్బలు చాల్లే" అనుకుంది వరలక్ష్మి. ఇంతకీ రాజ్యం చేసింది ఇదంతా కావాలనే ఇలా చేసింది ఎంతైనా స్నేహితురాలు కదామరి!

భోజనాలయాక కొంచెం సేపు కూర్చుని పడుకోడానికి వెళ్ళింది ఆవిడ.

"నువ్వూ పడుకో బుజ్జీ" అంటూ.

"నువ్వు పడుకో అమ్మా నేను కొంచెం సేపు రికార్డ్స్ విని వస్తాను అన్నాడతను.

"ఏం రికార్డ్స్ వొద్దు ఎప్పుడూ వినేవేగా."

"నిద్ర రావడం లేదమ్మా నువ్వెళ్ళు."

ఎన్నడూ మొగవాడిని చూడనట్టు ఆ రాక్షసుని తిరగడం ఏమిటో మరీనూ. ఇక్కడెక్కడా యూనివర్సిటీలు లేనట్లు బ్రహ్మాండంగా ఢిల్లీలో చదువుతోందట, ఇంతోటి ఎం. ఏ. వచ్చిన దగ్గర్నుంచీ వాడిని వదిలి తేగదా! ఆ తల్లి సరేసరి కావాలని నాటకం నడిపిస్తోంది.

పదకొండు గంటల దాకా ప్రకాశ్‌ని పడుకోనివ్వలేదు వసంత. ఆ పైన "పడుకోండి ప్రకాశ్ మళ్ళీ పాపం రేపు ఇద్దరమ్మాయిల్ని చూడాలి కదా" అని తను వెళ్ళిపోయింది.

జయంతి చాలా సీరియస్‌గా చదువుతోంది ఆర్థర్ హెయిలీనవల.

"బెస్ట్ ఆఫ్ లక్" అంది అక్కని చూసి.

వసంత జయంతి ప్రక్కనవాలి "అయ్యో ఆంటీ మొహం. చూడక పోవితిగదా. రేపు చూడు ఇంకా తమాషా" అంది.

"ఆంటీ సంగతేమో గానీ అమ్మకి మాత్రం మహా సంతోషంగా వుంది సుమా. ఆ సంతోషంతో నడుం విరిగేపని చేస్తున్నా పట్టించుకోడం లేదు. అమ్మ కూడా యింతేనని నేననుకోలేదే వసంతా!" అంది దిగాలుగా జయంతి.

"మనస్సు చంచలం అంటా రందుకేనే వెర్రిపిల్లా. నాన్నగారికి మాత్రం అమ్మ మీద చాలా కోపంగా వుంది" అంది వసంత. తెల్లవారు తూనే వరలక్ష్మి దేవి కొడుకుని అమ్మాయిల నీడ పడనివ్వకుండా వుండడం కోసం వెంట పెట్టుకొని షాపింగ్‌కి బయలు దేరింది.

అది చూసి "ఈ వూళ్ళో మీరేం షాపింగ్ చేస్తారు ఆంటీ నేనూ వస్తానువదండి. నాన్న నడిగి కారు తెస్తాను." అంది.

"ఓహో కారుందా మీకు." అంది వరలక్ష్మి దేవి కాస్త మెత్తబడి.

"వుంది ఆంటి నాన్నగారికి ఆఫీస్ వాళ్ళు కారు కొనుక్కోమని అప్పు యిచ్చేరు. నాన్నగారి జీతంలోంచి ఆ అప్పు తీర్చేశారు. క్రింగటి నెలకి అయిపోయింది ఇప్పుడు కారు మాదే."

"డ్రయివరున్నాడా?"

డ్రయివరెందుకు అంటీ మా ఇంట్లో అందరం డ్రయివ్ చేస్తాం. అమ్మ, నేనూ జయంతీ అందరం"

"ఓహో నీ డ్రయివింగ్ ప్రతాపం మావాడికి చూపించాలనా" అనుకుని "సరే అయితే పద" అంది ఆవిడ.

వసంత స్టీరింగ్ ముందు కూర్చోగానే తను వెళ్ళి ఆమె ప్రక్కన కూర్చుని ప్రకాశ్‌ని వెనక కూర్చోమంది.

"నువ్వే వెనక్కి రామ్మా నాకు వెనక అలవాట్లేదు." అని మొండికెత్తాడతను.

అయిష్టంగానే వెనక కూర్చుంది ఆవిడ "నేరకపోయి షాపింగ్ ఒకటి పెట్టుకున్నాను, బాబోయ్!" అనుకుంటూ. ముందు

సిట్లో ఇద్దరూ ఇంగ్లీష్‌లో తెగ మాట్లాడేసుకుంటున్నారు. వరలక్ష్మి కేవి పాత మెట్రిక్యు లేటు. ఆవిడకి ఇంగ్లీషొచ్చు కనుక వాళ్ళ మాటలు మరీ ప్రమాదకరంగా లేవని గుర్తించింది ఆవిడ. ఎలాగో ఈ రోజుగడిపేస్తే తెల్లవారి యిక్కడ నించీ బయట పడ వచ్చు అనుకుంది.

మధ్యాహ్నం భోజనం దగ్గర వసంత వాళ్ళు ప్రకాశ్ ప్రక్కన కూర్చుని, "మరో బజ్జీ తినండి." "ఇంకొంచెం కూర వేసుకోండి" అని మొదలెట్టింది.

"వాడికింతింత తినడం అలవాట్లేదమ్మాయ్. ఉర్కేఇల వంతం చెయ్యకు ఆరోగ్యం చెడుతుంది." అని కసిరింది వర లక్ష్మిదేవి.


"మీరూ రుకొండి అంటీ హి ఈజ్ ఈటింగ్ విత్ రెలిష్" తనూ కసిరింది వసంత. రెండున్నరకి పెళ్ళి చూపుల కార్యక్రమం మొదలయింది.

"మేం పెళ్ళి చూపులయినాక అటునించే దేవాలయానికి వెళ్ళి ఆలస్యంగా వస్తాం అరవిందా తొమ్మిదవుతుంది "అని చెప్పి వెళ్ళింది వరలక్ష్మి.

"ఏమిటి జాతరకి అర్థం?" అన్నాడు సాయంత్రం అనం దరావు.

"మీరూరు కోండి నాన్నా అంతా మేంచూసు కుంటాంగా!"



అంది జయంతి.

"మీ అమ్మకి మతి పోయింది ఇన్నాళ్ళూ తననిగురించి నేననుకున్నదంతా అబద్ధం అన్నట్లు ప్రవర్తిస్తోంది ఆవిడకి కొంచెం పిచ్చెక్కింది." అన్నాడతను ఆవేదనగా.

'ఏం లేదులే నాన్నా! ఈ సరికి తనుచేసిన తప్పేమిటో అమ్మకి అర్థం అయివుండాలి ఏదోచిన్న టెంప్టేషన్ అంతే ఇంక దాన్ని గురించి అనకండి" అంది వసంత.

వరలక్ష్మి ప్రకాశ్ రాత్రి తొమ్మిదింటికి వచ్చేరు. ఆవిడ ఆకలి లేదని మజ్జిగ మాత్రం పుచ్చుకుంది. తనకోసం వసంత కని పెట్టుకుని కూర్చుందని ప్రకాశ్ భోజనానికి వచ్చాడు.

కొడుకుని గదిలోకి పిలిచి త్వరగా పడుకొమ్మని చెప్పింది వరలక్ష్మి.

"పడుకుంటాలే అమ్మ మరీచిన్న పిల్లాడిలా అన్నింటికీ పట్టించుకోకు" అనేసేడు ప్రకాశ్ కొంచెం అసహనంగా. ఓహో! పడిపోయిందన్న మాట ఆడపిల్ల ప్రభావం!

అవతల గదిలో జయంతికూని రాగం తీస్తోంది "ఎంత నేర్చినా ఎంత చూచినా ఎంత వారలైనా కానీ ఐంద్దం" ఇంత మాత్రానికే ఇలాంటి తాటాకు చప్పుళ్ళకి వరలక్ష్మి చెదరదు ఎంత గుండె ధైర్యం లేక పోతే పట్టుమని పాతికేళ్ళు నిండనప్పుడు భర్త చనిపోతే ఇద్దరు పిల్లల్ని పెంచుకుని అంతంత లేసి చదువులు చదివించుకుని, బంధువుల బారి నుంచీ ఆస్తి రక్షించుకుని ఇలా వుండగలుగుతూంది! అనుకుని తను నిద్ర పోయింది వరలక్ష్మి.

వసంతా ప్రకాశ్ డాబామీద కూర్చున్నారు. పైన వెన్నెల కురుస్తోంది. వడగాడ్పు చల్ల బడింది.

"అమ్మాయిలు ఎలావున్నారు? నచ్చారా?" అంది వసంత

"ఊహూ నాకునచ్చలేదు" అన్నాడు ప్రకాశ్.

"ఏం! ఒకమ్మాయి ఎం.డి ఇంకో అమ్మాయి ఎంటెక్ అను కుంటాగా"

"ఏమో నాకు వాళ్ళు నచ్చలేదు వాళ్ళు నీలాలేరు." అన్నాడు ప్రకాశ్.

"ఓహో ! నాదేం వుంది నేను చాలా మామూలు మనిషిని. నాఐక్యూ చాలా తక్కువ. ఆ ఫ్టరాల్" అంది వసంత.

ప్రకాశ్ ఏం అనలేదు. ఆ తరువాత వాళ్ళిద్దరూ కాసేపు ఇండియా గురించి కాసేపు అమెరికా గురించి మాట్లాడుకున్నారు.

వసంత ఆవులిస్తూ, "ఇంక పడుకోండి వెళ్ళి" అంది.

ప్రకాశ్ లేచి నిలబడి, "నేనొకమాట చెబితే కోపం తెచ్చుకోకుండా ఉంటావా ?" అనడిగేడు.

'చెప్పండి' అంది వసంత.

"నాకీ పెళ్ళి చూపుల పిల్లలెవరూ నచ్చలేదు. మా వూరువెళ్ళి అమ్మని వొప్పించే బాధ్యతనాది. మరి నేనంటే నీకిష్టమో కాదో చెబితే."

వసంత చాలా నిబ్బరంగా చిరునవ్వు నవ్వి, 'మీరు వెళ్ళేది

చెప్పు గదా. అప్పుడు చెబుతాను ఓ.కే' అంది.

'అలాగే' అన్నాడు అతను వెళ్ళిపోతూ.

'ఏమంటాడే బుజ్జి' అంది జయంతి.

"అంతా మామూలే" అంది వసంత.

అవతల వరలక్ష్మికి నిద్రమెలకువ వచ్చింది. చూస్తే బుజ్జి అప్పుడే కూనిరాగాలు తీస్తూ మంచం మీద పడుకుంటున్నాడు. ఇప్పటిదాకా అమ్మాయిల్తో బాతాఖానీ వేశాడన్నమాట. అరవింద తెలివిగలదే. రెండురోజులు అతిథి సత్కారంలో పైన ఖర్చు లేకుండా బంగారంలాంటి పిల్లాడిని వలలో వేసుకోవాలనుకుంది.

"లక్ష్మీపతిగారమ్మాయిని సెటిల్ చేసుకుందాం బుజ్జీ" అంది వరలక్ష్మి, లేచి మంచం మధ్య బాసింపట్టు వేసుకుని కూర్చుని.

"ఎవర్నమ్మా ఆ డాక్టరమ్మాయినా !"

"అవున్రా అన్ని విధాలా ఆ సంబంధం బావుంది. ఆ పిల్లకి అన్నిక్లాసుల్లోనూ మంచి మార్కులే కళ్ళజోడు లేదు కొంచెం రంగు తక్కువైనా ముద్దాగానే బావుంది వాళ్ళు కూడా కొంచెం ఉన్నవాళ్ళే పిల్లకేదో పెట్టకుండా ఉండరు

ఆ పిల్లకి అమెరికా వెళ్ళాలని ఉంది. పూర్కే వెళ్ళాలంటే కుదరదు కదా అందుకని ఈ సంబంధం కుదిరితే సంతోషిస్తుంది అక్కడికొచ్చేక ఎక్కడో ఒకచోట డాక్టర్‌గా చేరవచ్చు ఏం అంటావ్ ?"

"రేపు చెబుతానమ్మా !"

"రేపు చెప్పడం ఎందుకూ ! ఇంతకన్నా మంచిపిల్ల మన కెక్కడ దొరుకుతుంది చెప్పు చదువు తెలివీ రూపం అన్నీ ఉన్నాయి ఇంగ్లీషు ధారాళంగా మాట్లాడుతోంది.

మానర్స్ బావున్నాయి. ఎంతైనా చిన్నప్పటినించీ కాన్వెంటు చదువు. ఇదంతా ఎందుకూ జెనిటిక్స్ గురించి నీకు నేను చెప్పాలా? నా చదువెంత నీ చదువెంత ?" అందిమళ్ళీ.

ప్రకాశ్ మాట్లాడలేదు

"పెళ్ళి నూరేళ్ళపంట ఎన్నో ఆలోచించుకునిగానీ చేసుకో కూడదు తెలుసా ? అవేళాలకి పోయి ఎవర్నో ఒకర్ని కట్టుకుంటే వంశం అంతా బాధపడాలి."

ప్రకాశ్ ఇప్పుడు కూడ మాట్లాడలేదు అతను కళ్ళుమూసు కుంటే వసంత మొహం కనిపించింది కళ్ళుతెరిచి కిటికీ వైపు చూస్తే ఆకాశంలో చందమామ కనిపించింది. చందమామలో మళ్ళీ వసంత ముఖం కనిపించింది రేపు చెబుతుందట పెద్ద పెట్టు అడిగినవాళ్ళు అలుసైపోతారుగావును. అమెరికాలో కాపురం. ఇంత చదువుకుని అంత సంపాదించే భర్త వెనక ఆస్తి ఏ ఆడ పిల్ల కక్కర్లేదు రేపు చెబుతుంది ఏం చెబుతుంది "ఐలవ్యూ" అని కాబోలు ! ప్రకాశ్ గర్వంగా నవ్వుకున్నాడు

తెల్లవారి కాఫీలు తీసుకుంటూంటే

"పిల్లలు నచ్చారా? ఎలావున్నారు ?" అనడిగింది అరవింద

వరలక్ష్మిని.

"ఒకపిల్ల బాగా నచ్చిందమ్మా అరవింద! ఆపిల్ల ఎం. డి చేసింది. ఎం.బి.బి.ఎస్‌లో గోల్డ్ మెడలిస్ట్. పిల్ల బావుంది. మంచి మ్యానర్స్ ఉన్నాయి. కాస్త ఉన్నవాళ్ళే. పెళ్ళి మాకు తగ్గట్టు బాగా చేసేలా కనపడ్డారు. ఇవ్వాళ రమణమూర్తిగార్ని పిలిచి ఆ సంబంధం ఖాయం చెయ్యమని చెబుతాను." అంది వరలక్ష్మి. అని అరవింద మొహంలోకి చూసింది. అలా చూసేటప్పుడు అవిడకి కథల్లో చదివే ప్రేజులు కొన్ని "కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు" 'దీపం ఆరిపోయిన ఇల్లు. మబ్బులు కమ్మిన ఆకాశం' లాంటివి గుర్తొచ్చాయి.

"శుభం మరి మా అందరికీ పార్టీ ఎప్పుడు?"

అంది అరవింద, చాలా సంతోషంగా.

ఈసారి వరలక్ష్మికి "ఏడవలేక నవ్వినట్లు."

అన్నమాట జ్ఞాపకం వచ్చింది.

"పార్టీ పెళ్ళిలోనే. మీరంతా, వసంతా, జయంతీ తప్పకుండా పెళ్ళికి రావాలి. వారం రోజులుండాలి తెలిసిందా!" అంది కవ్వించినట్లు.

"తప్పకుండా అంటీ రమ్మంటే ఇప్పుడే రెడీ" అంది జయంతి.

రమణమూర్తిగారు వచ్చేరు సంబంధంఖాయం చెయ్యమంది వరలక్ష్మి. "ఇంటికి వెళ్ళి ఉత్తరం వ్రాస్తాం" అన్నాడు ప్రకాశ్.

"ఇంకా రాసేదేముంది. వాడి మొహం పిల్ల తండ్రిని మా వూరువచ్చి మంచి చెడ్డమాట్లాకో మనండి. మాకు పిల్లనచ్చింది" అని చెప్పింది ఆవిడ.

ఆయన వెళ్ళగానే స్వగ్రామం ప్రయాణం అయింది.

"మీ ఇంటికి వచ్చి ఉన్నందుకు మా వాడికి సంబంధం కుదిరింది. రెండురోజులు పాపం చాలా శ్రమపడ్డావు. శుభంజరిగింది గనుక నేనిచ్చే ఈ చిన్నకానుకని కాదనకు" అంటూ అరవిందకి ఓ చీరె పెట్టింది వరలక్ష్మి.

"రెండురోజులు అనవసరంగా ఇద్దర్ని కూర్చోపెట్టి మేపాను అని బాధపడుతుంది పాపం" అనుకుంటూ.

"మీరు రాకరాక మా ఇంటికొచ్చారు. క్షేమంగా వచ్చి లాభంగా వెడుతున్నారు గనుక నా కానుక కూడా కాదనకండి." అంటూ తను ఓచీరె అవిడకి పెట్టింది అరవింద.

"ఈవిడ దయాధర్మం నాకెందుకు" అనుకుని. టాక్సీ వచ్చినా వసంత దర్శనంకాలేదు రేపు చెబుతానన్న మనిషి ఓహో! ఇంత చదివినా సిగ్గేనన్నమాట! ఎక్కడికిపోతాయి ఆడ పిల్లల బుద్ధులు! చెప్పేమాటలు కొండలెక్కుతాయి. చేతలు మాత్రం మామూలే! నేలమీద ఉంటాయి. అనుకున్నాడు ప్రకాశ్.


వరలక్ష్మిదేవిని టాక్సీ ఎక్కనిచ్చి" నాకూలింగ్ గ్లాసెస్ లోపలుండిపోయాయి. అని ఇంట్లోకి వచ్చేడు ప్రకాశ్. అక్కడ నిలబడి ఉన్న వసంత అతనికో చిన్నకాగితం ఇచ్చి "కారులో

చదువుకోండి'' అని గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది. ప్రకాశ్ నవ్వుకున్నాడు. ఏం ఉంటుంది చదువుకోడానికి.

"నా అంత అదృష్టవంతురాల్ని నేనే 'అనో,' 'ఐలవ్యూ,' అనో అలాంటిదేదో ఒకమాట వ్రాసి ఉంటుంది. పోనీ కారులో నే చదువుదాం. తనంతట తను వలచివస్తే కాదంటుందా.''

టాక్సీ కదిలి ఊరిపొలి మేరలు దాటాక ఆగండం గడిచి నందుకు భగవంతుడికి ఓ నమస్కారం పడేసి సీటుకి చేరబడి హాయిగా కళ్ళుమూసుకొంది వరలక్ష్మీ దేవి. హుషారుగా కాగితం మడత విప్పేడు ప్రకాశ్. అక్కడ, టాక్సీ వెళ్ళాక సోఫాలో కూర్చుని "నాకేమిటిలా అయింది. నాపిల్లల్ని అందంగా తయారై అతన్ని ఆకర్షించమని అడగడానికి నాకు సిగ్గెలా లేకపోయింది? నేనింత పతనం ఎందుకయ్యాను?" అని ఆత్మ విమర్శ చేసుకుంటోంది అరవింద. వసంతకి ముఖం. చూపడానికి సిగ్గుపడుతు ఇక్కడ. టాక్సీలో హుషారుగా ఈలవేస్తూన్న ప్రకాశ్‌కి కాగితంలో ఈ పంక్తులు కనిపించాయి.

"ఓ అమ్మాయి ఓ అబ్బాయితో కాస్తంత చనువుగా మాట్లాడడం పెళ్ళి చేసుకునే ఉద్దేశ్యంతో అయి వుంటుంది అని అమెరికాలో వుంటూ కూడానువ్వు అనుకోడం నాకేం నచ్చలేదు ప్రకాశ్ మీఅమ్మని కాస్త ఏపెపిద్దామనే ఉద్దేశ్యంతో భోజనాల దగ్గర కొంచెం చనువుగా ప్రవర్తించేనే గానీ ఆకర్షింపజేసుకొడానికి మాత్రం కాదు. అలాంటి చవక బారు పద్ధతులకి లొంగి పోయేలా



అమ్మా నాన్నా మమ్మల్ని పెంచలేదు. అమెరికాలో ఉద్యోగం చేసే అబ్బాయి ప్రపోజ్ చెయ్యగానే ముందూ వెనకా ఆలోచించకుండా ఎగిరిగంతేసి "నాకి అదృష్టం చాలు. అనుకోడానికి నేనేం అమాయకురాల్ని కాను. ఐ. యామ్ సారీ ప్రకాశ్. నిన్ను పెళ్ళి చేసుకోవాలనే ఉద్దేశ్యం నాకు లేదు. ఒక స్నేహితుడిగా మాత్రం యిష్టం అంతే. నేనింకా చదువుకోవాలి నాకూ జీవితం మీద కొన్నియిష్టాలు, అభిప్రాయాలున్నయ్. అంచేత నువ్వు మీ అమ్మా ఎంపిక చేసిన మేధావంతురాల్ని వివాహమాడి. మేధావంతుల వంశానికి పునాది వెయ్యాలని నా ఆకాంక్ష. పెళ్ళికి పిలవడం మర్చిపోకేం. నీకు నాశుభాకాంక్షలు,"

*